


నేటి నుంచి బెంగళూరు-సత్యసాయి మెము రైలు రద్దు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి ప్రతిరోజూ సంచరించే సత్యసాయి, ధర్మవరం మెము రైలు మంగళవారం నుంచి రద్దు చేస్తున్నట్లు నైరుతి రైల్వే అధికారులు సోమవారం ప్రకటించారు. పెనుకొండ, మక్కాజిపల్లి మధ్య డబ్లింగ్ పనులు కొనసాగుతున్నందున మూడు రోజులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 25నుంచి 27వరకు గుంతకల్లు-హిందూపురం డెము రైలు, 26 నుంచి 28వరకు హిందూపురం గుంతకల్లు రైలు రద్దు చేసినట్లు ప్రకటించారు. 25 నుంచి 28వరకు బెంగళూరు నుంచి ధర్మవరం వెళ్లే మెమూ రైలు హిందూపురం వరకే ప్రయాణించనుంది.

కొప్పళ జిల్లా బంద్ విజయవంతం



ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాలు, పార్టీల నాయకులు 8



స్పీకర్‌కు నివేదిక అందజేస్తున్న రిజ్వాన్ అర్షద్ బృందం

స్పీకర్‌కు గ్రేటర్ బెంగళూరు బిల్లు

- బడ్జెట్ సమావేశాల్లో శాసనసభ ముందుకు..
- బీబీఎంపీని ఏడు కార్పొరేషన్లుగా విభజించాలి..
- జూన్ 30లోగా రిజర్వేషన్ల ప్రక్రియ.. కమిటీ సిఫారసు

7

పన్నులన్నీ.. పక్క రాష్ట్రాలకు..!



- రాష్ట్రంలో భారంగా రిజిస్ట్రేషన్ ట్యాక్స్
- పొరుగు రాష్ట్రాలకు వాహనదారులు
- ఏటా ఖజానాకు రూ.70-100 కోట్లు గండి
- 30 శాతం తగ్గింపునకు డిమాండ్
- బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రకటనకు ఎదురుచూపు
- సీఎం హామీ నెరవేరేనా..?



బెంగళూరు రవాణా శాఖ కార్యాలయం

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజిస్ట్రేషన్‌కు ధరల అధికంగా ఉండడంతో వాహనదారులు పక్క రాష్ట్రాలకు వలస పడుతు న్నారు. దక్షిణభారత్‌లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్ణాటకలో వాహనాల కొనుగోళ్లు లక్షల సంఖ్యలో పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో లగ్జరీ వాహనాల కొనుగోలుపై అధికమంది ఆసక్తి చూపుతున్నారు. అయితే రోడ్‌ట్యాక్స్ రూపంలో అదనంగా చెల్లించేందుకు ఉత్సాహం చూపనివారు పొరుగున ఉండే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి, గోవాలవైపు రిజిస్ట్రేషన్‌కోసం తరలిపోతున్నారు. ఈ పరిణామం రాష్ట్ర ఖజానాపై పెను ప్రభావం చూపుతోంది. ఏటా 70- 100 కోట్ల రూపాయల దాకా ఆదాయం గండి పడుతోంది. ఇత ర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో 30-40శాతం రోడ్‌ట్యాక్స్ అధికంగా ఉంది. పొరుగురాష్ట్రాలతోపాటు నాగాల్యాండ్, అరుణాచల్‌ప్రదేశ్, అస్సోం, బీహార్, డయ్యూడామన్‌లతోపాటు గోవా, పుదుచ్చేరిలో రిజిస్ట్రేషన్ అయిన వందలాది వాహనాలు, బస్సులు నగరంలో ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి.

30శాతం పన్ను తగ్గించాలని వినతి

రాష్ట్రంలో రోడ్‌ట్యాక్స్‌ను తగ్గించాలని ప్రైవేట్ బస్సు ట్యాక్సీ యజమానుల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ అయి విన్నవించారు. మరో వారం రోజుల్లో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో వాహన పన్నులు తగ్గించాలని వారు కోరారు. కనీసం 30శాతం తగ్గిస్తే వాహనదారులకు వెసలుబాటు ఉంటుందన్నారు. ప్రభుత్వం 25శాతం తగ్గించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా వాహనదారులు బడ్జెట్‌లో నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు

దేశమంతా సంచరించే అవకాశం..

నాగాల్యాండ్‌లో ఓ బస్సు రిజిస్ట్రేషన్, మూడు నెలల రోడ్‌ట్యాక్స్ రూ.18వేలుగా ఉంది. గోవాలో అన్ని సీట్ల సామర్థ్యం చేరి నెలకు రూ.11వేలుగా ఉంది. పుదుచ్చేరిలో వాహనాల సీట్ల సామర్థ్యానికి అనుగుణంగా ట్యాక్స్ ఉన్నా 3నెలలకు ఒక సీటుకు రూ.450గా నిర్ణయించారు. కర్ణాటకలో మూడు నెలలకు సాధారణ బస్సుకు రూ.82,360గాను, లగ్జరీ బస్సుకు రూ.1.20 లక్షల దాకా ఉంది. ఇతర రాష్ట్రాలలో సొంత వాహనంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నందున దేశమంతటా సంచరించేందుకు వీలుంది. బస్సులు, ట్యాక్సీలకు మాత్రం క్వార్టర్ ట్యాక్స్ వంటివి భారం అవుతున్నాయి.



పుదుచ్చేరిలో రిజిస్ట్రేషన్ చేయించిన కారు


2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు సుమారు 3వేలకుపైగా బస్సులు, రవాణా వాహనాలు పొరుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని రాష్ట్రంలో సంచరిస్తున్నాయి. ప్రతి వాహనానికి సుమారుగా రూ.16వేలు పన్నుగా భావించినా 3వేల వాహనాలకు 2.40 కోట్ల ట్యాక్స్ చెల్లిస్తున్నారు. వీటితోపాటు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, హైపొథికేషన్, ఎఫ్‌సీతోపాటు రోడ్‌ట్యాక్స్ అన్నీ కలిపి వాహనానికి రూ.5,962గా ఉంటుంది. ఈ లెక్కన 3వేల వాహనాలకు 1.78 కోట్ల రూపాయలు రాష్ట్రానికి నష్టం మిగిల్చింది. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ట్యాక్స్ ఎక్కువ ఉన్నందున పొరుగురాష్ట్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకుంటారు. లగ్జరీ కార్లు, బస్సులు, భారీ వాహనాలు రాష్ట్రంలో అమ్ముడుపోవడం తగ్గుతుండడంతో డిస్ట్రిబ్యూటర్‌లు, ఏజెన్సీలు నిర్వహించే షోరూం నిర్వాహకులకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఇలా అన్ని విధాలా ఏడాదికి వంద కోట్ల రూపాయలదాకా ఖజానాకు నష్టం వాటిల్లుతున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా వాహనాల మార్కెటింగ్ షోరూం ధర ఒకేరకంగా ఉంటుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రోడ్‌ట్యాక్స్‌తోపాటు ఇతరత్రా పన్నులు భారం అవుతున్నాయి. కర్ణాటకలో 13-20శాతం ట్యాక్స్ ఉండగా, అరుణాచలప్రదేశ్, రాజస్థాన్, పుదుచ్చేరి, నాగాల్యాండ్‌లలో 6-10శాతం మాత్రమే ఉంది. ట్యాక్స్ ఎక్కువగా ఉన్నందున వాహన యజమానులు అడ్డదారుల ద్వారా మోసానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో వాహనం రిజిస్ట్రేషన్ చేయాలంటే స్థానికంగా నివసిస్తున్నట్టు ధ్రువీకరణపత్రం సమర్పించాల్సి ఉంటుంది. ఇటువంటి నకిలీ రెసిడెన్షియల్ సర్టిఫికెట్‌లను సృష్టించుకుని పొరుగు రాష్ట్రాల్లో మధ్యవర్తుల ద్వారా వాహనాలు కొనుగోలు చేస్తున్నారు.

మార్మోగుతున్న ఓంకారం..!

- మహాశివరాత్రికి ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు
- పాదయాత్రగా ధర్మస్థళ, మలెమహదేశ్వరకు భక్తులు
- జాగరణ వేళ సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు



ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి



మురుగేశ్‌పాళ్యలో..

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంతటా శివనామస్మరణ మార్మోగుతోంది. మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు సిద్ధ మవుతున్నాయి. దక్షిణాదిన ప్రాచీన, పురాతనమైన శైవక్షేత్రాలు కల్గిన రాష్ట్రంలో మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలో పవిత్రమైన శైవక్షేత్రాలు వివిధ పేర్లరూపంలో కొనసాగుతున్నాయి. శివరాత్రి పండుగ రాష్ట్రమంతటా జరుపుకొనే సంప్రదాయం ఉంది.

బెంగళూరులోని అత్యంత పురాతనమైన గవి గంగాధరేశ్వర ఆలయంలో జాతరకోసం ఏర్పాట్లు సాగుతున్నాయి. ఉదయం నుంచే ప్రత్యేకపూజలు ప్రారంభం కానున్నాయి. ఇక మల్లేశ్వరంలోని కాడుమల్లేశ్వర ఆలయంలో సర్వం సిద్ధం చేశారు. హెచ్‌ఏఎల్ రోడ్డులోని శివోహం ఆలయంలో నిత్య భజనలు, సంకీర్తనల ఆలాపనకు ఏర్పాటు చేయదలిచారు. చామరాజనగర జిల్లాలో పవిత్రపుణ్యక్షేత్రంగా రారాజిల్లుతున్న మలెమహదేశ్వర ఆలయంలో జాతర జరుగుతుంది. ఇక్కడి ఆలయానికి మైసూరు, మండ్య, రామనగర, తమిళనాడుతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పాదయాతకు వెళ్తారు. ఇప్పటికే వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులు రెండురోజులుగా మహదేశ్వర కొండలపైకి చేరారు. మరింతమంది భక్తులు మంగళవారం చేరుకోనున్నారు. ఈ ప్రాంతంలో లోతైన నదిలో దాటుకుని వెళ్లేందుకు భక్తులు ఉత్సాహం చూపుతారు.

ఇక దక్షిణకన్నడ జిల్లాలో పేరొందిన ధర్మస్థళ మంజునాథస్వామి ఆలయాన్ని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిపోతున్నారు. బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పాదయాత్ర రూపంలో వెళ్తున్నారు. ఇక్కడ పవిత్రమైన నేత్రావతి నదిలో స్నానం చేసి శివరాత్రిన మంజునాథస్వామిని దర్శించుకునే సంప్రదాయం ఉంది. శివరాత్రికి పెద్ద ఎత్తున భక్తులు ధర్మస్థళకు తరలివస్తుంటారు. ఉత్తరకన్నడ జిల్లా సముద్ర తీరాన వెలసిన మురుడేశ్వరను చూసేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. చిక్కబళ్ళాపుర నంది కొండలలో భోగనందీశ్వర ఆలయం పురాతనమైనది. కోలారు జిల్లాలో కోటిలింగేశ్వర, మైసూరు జిల్లాలో నంజనగూడు శ్రీకంఠేశ్వర ఆలయంలో ఏర్పాట్లు సాగుతున్నాయి. భక్తుల రద్దీని నియంత్రించేందుకు బ్యారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. శివాలయాల సందర్శనకు భక్తులు సిద్ధమయ్యారు.



మలెమహదేశ్వరకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ప్రసన్న కాశీ విశ్వేశ్వర ఆలయంలో...

చేళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని తాలూకా కేంద్రమైన చేళూరులోని ప్రసన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఈనెల 26న స్వామివారి రథోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలుత విశేష పూజలు, అభిషేకాలు ఉంటాయన్నారు. వివిధ యామపూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణలు చేశారు.



అలంకరణలో విశ్వేశ్వరుడు

ఏకకాలంలో 1122 మంది వచనగానం

వివరాలు..7లో

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్య

- విషం తాగి.. నదిలో దూకి బలవన్మరణం
- మండ్య జిల్లాలో విషాదం

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా యలియూరు వద్ద సోమవారం చోటు చేసుకుంది. మీడియాతో మండ్య ఎస్పీ మల్లికార్జున బాలదండి తెలిపిన వివరాల మేరకు మాస్తప్ప (52), భార్య రత్నమ్మ (45), కుమార్తె (18) మృతి చెందినవారు. శ్రీరంగపట్టణ పరిధిలోని గంజాం ప్రాంతంలో నివసించేవారు. పేద కుటుంబానికి చెందిన మాస్తప్ప జీవనం కోసం ఆటో నడిపేవాడు. కుటుంబ నిర్వహణకోసం రూ.3లక్షలతో పాటు మరిన్ని అప్పులు చేశాడు. అయితే అప్పులు ఇచ్చినవారు ఇంటి వద్దకు వచ్చి గొడవ చేయడంతో మనస్థాపానికి గురయ్యాడు. కుటుంబసమేతంగా విషం తాగి, తాలూకాలోని యలియూరు వద్ద గల విశ్వేశ్వరయ్య కాలువ (వీసీ కెనాల్)లోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. మండ్య రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ఆత్మహత్య చేసుకున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

చట్టాలపై నిరంతర అధ్యయనం తప్పనిసరి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్

7

తెలంగాణ ఆర్టీసీలో పదిశాతం రాయితీ

భీమ జ్యువెలర్స్‌లో బంపర్ ఆఫర్లు

BHIMA

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆభరణాల విక్రయాలలో వినియోగదారుల నమ్మకం పొందిన భీమ జ్యువెలర్స్ ఫిబ్రవరిలో బంపర్ ఆఫర్‌లను ప్రకటించింది. ఈనెల 5నుంచి ప్రారంభమైన ఆఫర్‌లు నెలాఖరుతో ముగియనున్నాయి. కస్టమర్లకు సాటిలేని డిస్కౌంట్‌లు, ఉత్తేజపరిచేలాంటి రివార్డులు అందిస్తున్నట్టు భీమ జ్యువెలర్స్ ముఖ్యులు ప్రకటించారు. కాలానికి అనుగుణంగా అతీతమైన సంపదలో పెట్టుబడికి సరైన సమయమని సూచించారు. బంగారం, వెండి ఆభరణాలపై మేకింగ్ చార్జీ 70శాతం వరకు రాయితీ పొందవచ్చునని, సంప్రదాయాల హస్తకళా నైపుణ్యం, సమకాలీన డిజైను ఆభరణాలు పొందేందుకు అత్యుత్తమ అవకాశంగా సూచించారు. వజ్రాల ఆభరణాలు కొనుగోలు చేసేవారికి ప్రతి క్యారట్‌పై రూ.7వేల తగ్గింపు వర్తింపచేస్తున్నామన్నారు. ప్రతి వజ్రాభరణం కొనుగోలుపై అదనపు మెరుపుతో ప్రతి క్యారట్‌తో ఒక బంగారునాణెం ఉచితంగా ఇస్తున్నామన్నారు. ప్రతివారం 20మంది లక్కీ కస్టమర్లకు అప్రెలియా స్కూటర్‌ను ఇంటికి తీసుకెళ్లేలా లక్కీడ్రా నిర్వహిస్తున్నామన్నారు. భీమా ప్రత్యేక స్క్రాచ్ అండ్ విన్ క్యాష్‌బ్యాక్ ఆఫర్ ప్రవేశపెడుతున్నామన్నారు. వినియోగదారులు ప్రతి కొనుగోలుపై గ్రాముకు రూ.150వరకు క్యాష్‌బ్యాక్ పొందే అవకాశం ఉందని వెల్లడించారు. వినియోగదారులు ఎక్కడి భీమ స్టోర్‌లోనైనా ఫ్యాబులస్ ఫిబ్రవరి ఆఫర్‌ను సొంతం చేసుకోవచ్చునన్నారు. డిస్కౌంట్‌లతోపాటు భారీ బహుమతులు పొందేందుకు మరో నాలుగురోజులు మాత్రమే అవకాశం ఉందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనుమతి లేకున్నా గనుల వేలం..!

- 8 గనులకు వేలం నిర్వహించిన మైనింగ్ అధికారులు
- సండూరులో తవ్వకాలకు అనుమతులు లేవంటున్న అటవీ అధికారులు

బళ్లారి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇనుప గనుల్లో తవ్వకాలకు అటవీశాఖ అనుమతులు పొందకుండానే గనుల శాఖ ఏకంగా 8 గనులను వేలం వేసేసింది. దేశంలోనే ఇనుప గనులకు ప్రసిద్ధి చెందిన సండూరు ప్రాంతంలో ఇనుప గనులను లీజ్‌కు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సండూరు అటవీప్రాంతంలో సౌత్‌ఏరియా ఫారెస్టు ప్రాంతంలో ఉన్న వర్జిన్ ఫారెస్టు లో 217.453 ఎకరాల్లో మేలు రకం ఇనుప ఖనిజాలు భూగర్భంలో విస్తరించి ఉన్నాయి. ఇంతక ముందు కుమారస్వామి ఇనుప ఖనిజ బ్లాక్‌కు ఇటీవల వేలం వేశారు. ఇందులో అత్యధికంగా సుమారు 200 శాతం ఆర్‌బీఎస్‌ఎస్‌ఎన్ కొనుగోలు చేసింది. గనుల శాఖ అటవీప్రాంతంలో ఉన్న గనుల వేలం వేసే విషయంలో కనీసం అటవీశాఖ అధికారుల సమాచారం ఇవ్వడం కానీ, అక్కడ మైనింగ్ తవ్వకాలకు సాధ్యాసాధ్యాల పై వివరణ కూడా కోరలేదని అటవీశాఖ ఉన్నతాధికారి కేంద్ర అటవీశాఖ అధికారులకు ఉత్తర్వులో పేర్కొన్నారని సమాచారం.

ఏదైనా ఒక గని తవ్వకాలకు లీజ్ ఇవ్వాలన్నా, పబ్లిక్ టెండర్లలో పిలవాలన్నా ముందుగా నోటిఫికేషన్ జారీ చేయాలి. ప్రాణహానీ, జలాల కలుషితం, ప్రజాఆరోగ్యం, రైతుల పొలాలు, వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ తదితర వాటిపై అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. అన్ని అనుమతులు, అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే టెండర్లుకు పిలవాలి. కానీ అలాంటిదేమీ లేకుండానే ఏకంగా 8 గనులకు టెండర్లు పిలవడం వెనక కేంద్ర మంత్రివర్గంలో ఉన్న ఓ రాజకీయ నాయుడు ఒత్తిడి ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వేలం వేసిన ఇనుప గనులు ఇవే..

బళ్లారి జిల్లాలోని సండూరు తాలూకా జంబునాథ్, విభూతిగుడ్డ, కరడ ఖోన, ఉత్తర రాజపుర, దక్షిణ రాజపుర, శాంతిప్రియ. అలాగే కుమారస్వామి గనుల వేలం, వీటితో పాటు విజయనగర జిల్లా కరిగనూరు ఇనపఖనిజం చిత్రదుర్గం జిల్లాలోని జంతకల్, టుంకూరులోని జానేహరా మొత్తం ఎనిమిది మైనింగ్ ప్రాంతాలను వేలం వేశారు.

అటవీశాఖ అనుమతులు లేవు: సందీప్, డీసీఎఫ్

అటవీప్రాంతంలో కొత్తగా ఏమైనా మైనింగ్ తవ్వకాలకు ప్రభుత్వ టెండర్లు పిలిచినా, ఏదైనా నూతన పనులు ప్రారంభించాలన్నా అటవీశాఖ అనుమతి తప్పనిసరి. ప్రస్తుతం ఈ ఎనిమిది మైనింగ్ లో తవ్వకాలకు అటవీశాఖ అనుమతి ఇవ్వలేదు.

గనులు, భూగర్భ శాస్త్రశాఖ అధికారులు 2024 అక్టోబరు 3న నోటిఫికేషన్ జారీ చేశారు. సండూరు అడవిలో లీజ్ కాలం ముగిసిన అలాగే కొత్త గా మైనింగ్ లీజ్‌లకు సిద్ధం చేసింది. తరువాత మరోసారి 2024 అక్టోబరు 16న మరో సారి సమావేశం అయ్యారు. అధికారులు అనేక అంశాల పై చర్చించారు. కానీ వర్దన్ గుడ్డ ఏరియాలో మైనింగ్ తవ్వకాలకు ఏమాత్రం వీలు కాదని ఫారెస్టు అధికారులు గత సమావేశంలోనే అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడ వంకలు, వాగులు ఎక్కువగా ఉన్నాయి. అలాగే కుమారస్వామి దేవాలయం కూడా దగ్గరలోనే ఉంది. ఇక్కడ మైనింగ్ తవ్వకాలు చేస్తే అడవి కలుషితం అవుతుంది. వంకలు, వాగుల్లో ప్రవహించే నీటిలో మైనింగ్ కలిసి ప్రాణాతకరంగా మారుతుందని అటవీశాఖ అప్పట్లో పేర్కొంది. కానీ ఇప్పుడు అటవీశాఖ అధికారులు అనుమతి లేకుండానే ఏకంగా మైనింగ్ తవ్వకాలకు టెండర్ల పిలవడం అటవీశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర అటవీశాఖ అధికారులకు కూడా తమ అభ్యంతం తెలియజేస్తామని జిల్లా అటవీశాఖ అధికారి పేర్కొన్నారు.



సండూరు ప్రాంతంలో గనుల తవ్వకాలు (ఫైల్)



యాడికి మండలంలోని ఆదర్శ పాఠశాల సమీపాన ఉన్న వంకలోని నీటి గుంత గట్టుపై కొంగల గుంపు

మండే ఎండను లెక్కచేయక..
ఒంటి కాలిపై..
గంటల కొద్దీ చేశాం జపం..
కాసింత ఆహారం కోసం..
దొరికితే తిన్నాం..
లేదంటే పస్తున్నాం..
చెరువే ఆధారం.. ఆవాసం..
అందులో నీరుంటేనే జీవనం..
ఆ ఆశ ఇంకిపోతోంది..
కొంగలం జపం చేయగలం..
భగీరథులై తపం చేయలేం..
గంగను రప్పించనూ లేం..
ఓటర్లు కూడా కాం..
పోరాడి నీటిని తెచ్చుకోలేం..
ప్చ్.. ఏం చేయగలం..?
ఈ వేసవి ఎలా నెట్టుకురాగలం?

- ఆంధ్రజ్యోతి, యాడికి

పది ఫలితాల్లో బీసీ హాస్టళ్లను

టాప్‌లో నిలపడమే లక్ష్యం

● బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ సంక్షేమ వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులను ఈ ఏడాది ఫలితాల్లో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పెట్టుకున్నామని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారీ అన్నారు. అందుకోసం ఇప్పటికే యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని, చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యార్థి పాసయ్యేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామంటున్న ఆమెతో ఇంటర్వ్యూ...

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న: వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు: జిల్లాలోని అన్ని వసతిగృహాల్లో శుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నాం. పిల్లలకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీపడొద్దని వార్డెన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

ప్రశ్న: పదో తరగతిలో వెనుకబడిన స్టూడెంట్స్ పరిస్థితేంటి..?

జవాబు: పదో తరగతిలో ఏ, బీ, సీ గ్రేడ్‌ల వారీగా విద్యార్థులను పరిశీలిస్తున్నాం. అందులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. వారికోసం ఇద్దరు, ముగ్గురు ట్యూటర్లను పెట్టి సబ్జెక్టుల వారీగా శిక్షణ ఇస్తున్నాం.

ప్రశ్న: కొందరు వార్డెన్లు పిల్లలకు అరకొర భోజనం పెడుతున్నారన్న విమర్శలున్నాయి..?

జవాబు: జిల్లాలో విద్యార్థులకు మెనూ అమలు పరిచే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఇప్పటికే వార్డెన్లకు ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా మెనూలో అలసత్వం వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవు.

ప్రశ్న: జిల్లాలో ఎఫ్‌ఆర్‌ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) పనితీరు ఎలా ఉంది?

జవాబు: జిల్లాలో గతేడాదే ఎఫ్‌ఆర్‌ఎస్ కోసం కొన్ని హాస్టళ్లను పైలట్‌గా తీసుకున్నాం. ఇప్పటి వరకూ 70 శాతం వరకూ సక్సెస్ ఫుల్‌గా సాగుతోంది. ఈ సంవత్సరం అన్ని హాస్టళ్లలో అమలు చేస్తున్నాం.

ప్రశ్న: సొసైటీ లోన్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయా..?

జవాబు: ప్రస్తుతం సొసైటీ లోన్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు చేపట్టడం లేదు. రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వస్తే.. కార్పొరేషన్ సహకారంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడతాం.

జోరుగా కంది కొనుగోళ్లు



కందులను విక్రయిస్తున్న రైతులు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కంది కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మార్క్‌ఫెడ్, వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి మండలంలో కంది కొనుగోలు ప్రారంభించారు. క్వింటా రూ.7550 ధరతో కొనుగోలు చేస్తున్నారు. రాచానపల్లి, చియ్యేడు సహకార పరపతి సంఘాల్లో కంది కొనుగోళ్లు చేపడుతున్నారు. మండల వ్యాప్తంగా 844 మంది రైతులు కంది పంట విక్రయాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈనెల 22వ తేదీ వరకు 527 మంది రైతులు పంటను విక్రయించుకున్నారు. చియ్యేడు సహకార పరపతి సంఘంలో 341 మెట్రిక్ టన్నులు, రాచానపల్లిలో 193 మెట్రిక్ టన్నుల కందులను రైతులు విక్రయించారు. పీఏసీఎస్‌లో కందుల కొనుగోలు అనంతరం అవి గోదాముకు చేరిన తరువాత రైతులకు డబ్బు చెల్లిస్తారని అధికారులు చెబుతున్నారు.

మోసగిస్తే క్షమించేది లేదు: విజిలెన్స్ డీజీ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడితే క్షమించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. సోములదొడ్డి, సనప సమీపంలోని పెట్రోల్ బంకుల్లో మోసాలపై జిల్లా అధికారుల నుంచి డీజీ కార్యాలయానికి నివేదిక అందింది. దీంతో ఆయన సీరియస్ అయ్యారు. సామాన్యులపై ప్రభావం చూపేలా మోసగించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. సోములదొడ్డి సమీపంలోని శ్రీవిజయ లక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంక్‌లో చిప్‌ను వినియోగించి డీజిల్ దోచుకుంటున్న విషయం లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. ఆత్మకూరు మండలంలోని సనప గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంకులో శనివారం దాడులు నిర్వహించారు. అధికారులు గుర్తించలేని స్థాయిలో అత్యాధునిక చిప్‌ను అమర్చి, పెట్రోల్‌ను దోచుకుంటున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను కొనసాగించాలని విజిలెన్స్ డీజీ ఆదేశించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం..!

కమ్మూరు ఉన్నత పాఠశాలలో ఆగిపోయిన పనులు

● విద్యార్థులకు తప్పని తిప్పలు
● తాగడానికి బోరు నీరే దిక్కు

కూడేరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నిధులు సిద్ధంగా ఉన్నా. నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. మండలంలోని కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్డు, బాత్‌రూమ్‌ల నిర్మాణ అర్ధంతరంగా ఆగిపోయింది. అదనపు తరగతి గదుల పనులు మొదలవనేలేదు. దీంతో విద్యార్థినీవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారు తాగడానికి శుద్ధి నీరు కూడా లేదు. బోరు నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు.

నిధులున్నా..

కమ్మూరు ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 90 మంది విద్యార్థులుచదువుకుంటున్నారు. గత ప్రభుత్వం రెండో విడత నాడు-నేడు కింద పాఠశాలల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరు చేసింది. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లతోపాటు వంటగది తదితర పనుల నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ.21 లక్షల వరకు నిధులు ఖర్చు చేసినా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ప్రస్తుతం రూ.7 లక్షల వరకు నిధులున్నాయి. ఉన్న నిధులతో ఆగిపోయిన పనులను పూర్తి చేయవచ్చు. ప్రభుత్వం మారడంతో పాఠశాలకు నూతనంగా తల్లిదండ్రుల కమిటీ ఎంపిక చేశారు. అధికారులు కూడా ఆగిపోయిన పనులపై దృష్టి పెట్టలేదు. ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని పాఠశాల చైర్మన్ పల్లకి ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. నిధులున్నా.. మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు, వంటగది తదితర పనులు అసంపూర్తిగా ఉన్నాయి.



అర్ధంతరంగా నిలిచిపోయిన మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌ల నిర్మాణం



గదుల నిర్మాణం కోసం ధ్వంసం చేసిన గదిపైన గోడలు

బోరు నీరే దిక్కు

పాఠశాలలో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. మధ్యాహ్న భోజనం వండడానికి కూడా బోరు నీరు వినియోగిస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాలలో శుద్ధి నీటి వసతి లేకపోవడంతో మధ్యాహ్న భోజనం తిన్న విద్యార్థులు బోరు నీటితో దాహం తీర్చుకుంటున్నారు. నాడు-నేడు కింద సరఫరా చేసిన శుద్ధి చేసే మిషన్ అమర్చకపోవడంతో నిరుపయోగంగా ఉంది. గతంలో పలువురు విద్యార్థులు పాఠశాలలో బోరు నీరు తాగి, అస్వస్థతకు లోనైనట్లు తెలిసింది.

అటకెక్కిన అదనపు గదుల నిర్మాణం

కమ్మూరు ఉన్నత పాఠశాలలో మూడు అదనపు తరగతి గదులను మంజూరు చేశారు. ఒక్కో గది నిర్మాణానికి రూ.13 లక్షలు చొప్పున రూ.39 లక్షలు విడుదల చేశారు. అప్పట్లో వైసీపీ నాయకులు ఆగమేఘాల మీద పాఠశాల పైభాగంలో అదనపు గదుల నిర్మాణానికి పాఠశాల పైన గోడలను ధ్వంసం చేశారు. అంతలోనే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయని అధికారులు చల్లగా చెప్పారు. గదుల నిర్మాణ పనులు చేయడానికి ధ్వంసం చేసిన పాఠశాల గదిపైన గోడలతోపాటు పిల్లర్లు అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో వర్షాలు కురిస్తే గోడల నుంచి వర్షపు నీరు గోడల్లోకి వెళ్లి, పాఠశాల గదులు దెబ్బతినే ప్రమాదం ఉందని ఉపాధ్యాయలు ఆందోళన చెందుతున్నారు.

పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం

పాఠశాలలో నాడు-నేడు రెండో విడత కింద పలు అభివృద్ధి పనులకు రూ.28 లక్షలు మంజూరయ్యాయి. అందులో వివిధ రకాల పనులు చేశారు. ప్రస్తుతం రూ.7 లక్షల నిధులున్నాయి. వాటితో ఆగిపోయిన పనులు చేయడానికి నూతన కమిటీ సభ్యుల పేరున బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంది. త్వరలోనే అకౌంట్ ఓపెన్ చేసి, పనులు పూర్తి చేస్తాం.

-రవిశంకర్, పాఠశాల హెచ్‌ఎం

సీపీఎం నేత బడా సుబ్బిరెడ్డి కన్నుమూత

● కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు
● నివాళి అర్పించిన నాయకులు



సుబ్బిరెడ్డి (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నేత బడా సుబ్బిరెడ్డి (66) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. అనారోగ్యంతో కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన కదిరి మండలంలోని వరిగిరెడ్డిపల్లికి తీసుకొచ్చారు. పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సుబ్బిరెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమలకు తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుబ్బిరెడ్డి మృతి సీపీఎంకు, రైతు సంఘానికి తీరని లోటని అన్నారు. సుదీర్ఘకాలంగా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అనేక ఉద్యమాలు కొనసాగించారని గుర్తు చేసుకున్నారు. సీపీఎం సత్యసాయి జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడిగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నట్లు తెలిపారు. బడుగు, బలహీనవర్గాల కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై, ఎన్పీకుంటలో సోలార్ కంపెనీ ఏర్పాటు సమయంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశారని పేర్కొన్నా రు. ఆయన పోరాటాలు, ఉద్యమాలు స్ఫూర్తిదాయకం అన్నారు. మృతుడి కు టుంబాన్ని పలువురు పరామర్శించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శులు కేశవరెడ్డి, కదిరప్ప, సీపీఎం నాయకు డు జీఎల్ నరసింహులు, పలువురు నాయకులు నివాళి అర్పించారు.

నూతన ఒరబడి

అంగన్‌వాడీల నుంచే కొత్త విద్యావిధానం

1,2 తరగతులను కలిపి ఫౌండేషన్ కోర్సు
పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణ
అంగన్‌వాడీ వర్కర్లకు బోధనలో మెలకువలు
మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు చర్యలు

కదిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టనున్న నూతన విద్యావిధానంతో ఫౌండేషన్, మోడల్ ప్రాథమిక పాఠశాలలు పటిష్టం కానున్నాయి. ఈనేపథ్యంలోనే ఫౌండేషన్ కోర్సు బోధించే అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. పూర్వ ప్రాథమిక విద్యకు వచ్చే చిన్నారులకు ఎలా బోధించాలో శిక్షణ ఇస్తోంది. పేద, మధ్యతరగతివారు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాలలు వేర్వేరుగా ఉండేవి. నూతన విద్యా విధానంలో పూర్వ ప్రాథమిక విద్యతోపాటు 1, 2, తరగతులను కలిపి ఏగ్రామంలో ఉన్నారో ఆగ్రామంలోనే ఏర్పాటు చేయడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీన్ని ఫౌండేషన్ కోర్సుగా చెబుతున్నారు.

మోడల్ ప్రాథమిక పాఠశాల ఇలా..

పంచాయతీ పరిధిలో అన్ని సౌకర్యాలున్న ఒక పాఠశాలను ఎంచుకుని, కిలోమీటర్ పరిధిలో ఉన్న ఇతర ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఆపాఠశాలలో చేర్చేలా యంత్రాంగం పావులు కదుపుతోంది. ఈపాఠశాలకు మోడల్ ప్రాథమిక పాఠశాలగా పేరు పెట్టారు. ఆ పాఠశాలకు రావడానికి ఇతర గ్రామాల విద్యార్థులకు రవాణా చార్జీలు



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు

కూడా ప్రభుత్వమే చెల్లిస్తుంది. ఈపాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు. విద్యార్థుల సంఖ్య 60కిపైగా ఉంటే అదనంగా మరో ఉపాధ్యాయుడిని కేటాయిస్తారు. అదే వంద దాటితే ప్రాథమిక ప్రధానోపాధ్యాయులు కూడా ఆపాఠశాలలో ఉంటారు. ఈవిధంగా ఫౌండేషన్, మోడల్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసి, డ్రాపౌట్ల సంఖ్య తగ్గించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పూర్వ ప్రాథమిక విద్యాబోధనపై శిక్షణ

పూర్వ ప్రాథమిక విద్యను బోధించడానికి అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం మండల కేంద్రాల్లో ఇప్పటికే శిక్షణ ప్రారంభించింది. 120రోజుల పాటు విడతల వారిగా ఈశిక్షణ కొనసాగనుంది. 20రోజులకు ఒక విడతగా శిక్షణ ఇస్తోంది. ఇందులో తొలి 14రోజులపాటు ఆన్‌లైన్ శిక్షణ, మిగిలిన ఆరు రోజులు భౌతిక శిక్షణ ఇస్తున్నారు. ఇందులో ఆరురోజులు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, అందులో శిక్షణ తీసుకున్న ఆర్పీలచే అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారు.

మూడు సంవత్సరాలు, నాలుగు సంవత్సరాలు పైబడిన చిన్నారులకు ఆటలు, భాషాజ్ఞానం, పరిసరాల విజ్ఞానంతో ఇతర అంశాలపై ఎలా బోధించాలో శిక్షణ ఇస్తున్నారు. పూర్వ ప్రాథమిక విద్యాబోధన శిక్షణతో మూడు, నాలుగు సంవత్సరాలు పైబడిన విద్యార్థులు, 1, 2, తరగతుల విద్యార్థులు శరీరక, మానసిక విజ్ఞానం పెంపొందుతుందని అధికారులు పేర్కొన్నారు.

బోధనలో మెలకువలు

పూర్వ ప్రాథమిక విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో అంగన్‌వాడీ టీచర్లకు మెలకువలు నేర్పారు. ముఖ్యంగా ఆటలాడటం, బొమ్మలతో పజిల్స్ చేయడం, పరిసరాలతో మెలగడం, భాషా పరిజ్ఞానాన్ని ఎలా పెంపొందింపజేయాలో శిక్షణ ఇస్తున్నారు. ఈ మెలకువతో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తమ పరిధిలోని విద్యార్థులకు విద్యాబోధన చేయనున్నారు. కార్పొరేటుకు దీటుగా ఇక్కడ విద్యాబోధన చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఫౌండేషన్ విద్యలో 3,4 సంవత్సరాలు పైబడిన వారితోపాటు 1, 2, తరగతుల విద్యార్థులు కలిసి ఉంటారు. ప్రభుత్వం ఉపాధ్యాయుడితోపాటు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులుకూడా కలిసే ఉండటంతో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇకమీదట కానరావు. 120రోజుల పాటు బోధనపై మెలకువలు ఇవ్వడం ద్వారా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పరిపూర్ణంగా బోధనకు సిద్ధమవుతారని అధికారులు స్పష్టం చేశారు.

తగ్గనున్న డ్రాపౌట్స్

ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన విద్యావిధానంతో డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఫౌండేషన్ కోర్సులో 3,4 సంవత్సరాలు పైబడిన పిల్లలతోపాటు 1,2 తరగతులు కూడా ఉంటారు. అక్కడి నుంచి నేరుగా మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులను చేర్చుకుంటారని, తరువాత హైస్కూల్ విద్యకు పంపడానికి ఆస్కారముంటుందంటున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అర్జీలపై అలసత్వం వద్దు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వ్యయప్రసాలకోర్చి వచ్చి అర్జీలు ఇస్తుంటారని, వాటిపట్ల అలసత్వం వద్దని అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 233 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

● అగ్రిగోల్డు బాధితులు కలెక్టర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. వివిధ పథకాల పేరుతో ఆ సంస్థ తమను మోసగించి 11 సంవత్సరాలు గడిచినా న్యాయం జరగలేదని బాధితులు అత్తార్ మహబూబ్‌బాషా, షబ్బీర్‌ఖాన్, ఆంజనేయులు, శంకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆనంద్‌బాబు, ఉత్తప్ప తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా తమకు డబ్బులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

భూ రీ సర్వేపై సమీక్ష

జిల్లాలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియను ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి భూ రీసర్వే, ఫ్రీ హోల్డు, రెవెన్యూ, పీజీఆర్‌ఎస్ సమస్యలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులను తయారు చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి లేపాక్షిలో శివరాత్రి వేడుకలు

లేపాక్షి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. వీరభద్రస్వామి ఆలయం, ఏకశిలా నంది విగ్రహం, లేపాక్షి పురవీధుల్లో విద్యుత్ దీపాలను సిద్ధం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి 12గంటల వరకు మహాగణపతి సుదర్శనహోమం నిర్వహిస్తామని అన్నారు. బుధవారం మహాశివరాత్రి అభిషేకాలు, దీపోత్సవం, రుద్రహోమం, స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తీచేశామన్నారు. 26న రాత్రి జాగరణకు బుల్లితెర నటులు, యాంకర్లతో పాటకచేరి, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 27న మధ్యాహ్నం 1 గంటకు స్వామివారి బ్రహ్మరథోత్సవం ఉంటుందన్నారు. 28న ముత్యాల పల్లకి కీలుగుర్రాలతో వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. 1న వసంతోత్సవం, ధ్వజారోహణ, శయనోత్సవంతో శివరాత్రి ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన ప్రసాదాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఏడు శిరస్సుల నాగేంద్రుడు



జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తచెరువు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మేడిన్ త్రీడీ ఫ్యూచర్ ఎంటర్‌ప్రెన్యూర్ ప్రోగ్రాం-2025కు ధర్మవరం మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన నమూనా ఎంపికైంది. రాష్ట్రంలోని ఏటీఎల్ పాఠశాలల విద్యార్థులు వందకుపైగా ప్రాజెక్టులను రాష్ట్ర సైన్స్ విభాగానికి ఆన్‌లైన్‌లో పంపించారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. ఇందులో ఐదు ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపియ్యాయని, ఐదింటిలో ధర్మవరం విద్యార్థుల ప్రాజెక్టు ఉందని ఆయన వెల్లడించారు. చేనేత వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం ధర్మవం మోడల్ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. చేనేత చీర పోగులు తెగిపోతే.. వాటిని అతికించడానికి ఉపయోగపడేలా ఎలక్ట్రికల్ పరికరం నమూనాను విద్యార్థులు తయారు చేశారని అన్నారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.20 వేలను విద్యార్థులకు అందించిందని అన్నారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులు సంజయ్, హేమంత్‌కుమార్, లావణ్య, అక్షయజ్యోతి, గుణశ్రీ, మేఘనను, గైడ్ టీచర్ శ్రావణిని ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

మెహెర్‌బాబా (జయంతి)



ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, భగవంతుని అవతారంగా ప్రకటించుకున్న మెహెర్ బాబా 1894 ఫిబ్రవరి 25న మహారాష్ట్ర రాష్ట్రం పూనెలో జన్మించారు. అసలు పేరు మెర్వాన్ షెరియార్ ఇరానీ. 19వ యేట ఆధ్యాత్మిక అన్వేషణలో భాగంగా ఐదుగురు గురువులను కలిశాడు. 1922లో ఆయనే ఒక సంప్రదాయాన్ని ప్రారంభించి 27ఏళ్ల వచ్చేసరికే శిష్యులను పొందారు. కేవలం చేతి సైగలతో, అక్షరాల పలకతోనే సంభాషించేవారు. కుష్టువ్యాధిగ్రస్తులకు, పేదలకు మానసిక వ్యాధులతో బాధపడేవారికి సేవలందించారు. ఆయన బోధనలు డిస్కోర్సెస్, గాడ్ స్పీక్స్ అనే పుస్తకాలలో పొందుపరచబడ్డాయి. ఇతరుల లోపాలను ఎత్తిచూపడం కన్నా మనని మనం సంస్కరింపబడడం ముఖ్యమని బోధించారు. 1969 జనవరి 31న కన్నుమూశారు. మెహరాబాద్‌లోని ఆయన సమాధి ప్రస్తుతం అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా దేశాలలో సైతం ఆయనకు భక్తులు నేటికీ ఉండడం విశేషం.

కొనకళ్ల వెంకటరత్నం (జయంతి)



కొనకళ్ల వెంకటరత్నం 1909 ఫిబ్రవరి 25న పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు గ్రామంలో జన్మించారు. పోలీసుశాఖలో పనిచేసి ఏలూరులో స్థిరపడ్డారు. గేయ రచయితగానే కాకుండా కథా రచయితగా పేరొందారు. ప్రతోళి, బంగారి మామ, పొద్దు తిరుగుడు పూలు వంటి గేయ కృతులను రాశారు. బంగారుమామ పాటల రచయితగా సుప్రసిద్ధులు. ఆయన కథలు ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రప్రభ, తదితర పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'మొక్కజొన్న తోటలో ముసిరిన చీకట్లలో..' పాట 1959లో విడుదలైన 'సిపాయి కూతురు' సినిమాలోనూ, తర్వాత 'అదృష్టవంతులు' సినిమాలోనూ ఉపయోగించారు. 1971 జనవరి 9న మరణించారు.

మొక్కపాటి కృష్ణమూర్తి (జయంతి)



మొక్కపాటి కృష్ణమూర్తి పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడు ప్రాంతంలో 1910 ఫిబ్రవరి 25న జన్మించారు. చిత్రకారుడు, శిల్పి, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈయన చిత్రాలు లినోకట్స్, ప్రకృతి దృశ్యాలు, పల్లెటూరి జీవనదృశ్యాలు, ప్రాచీన గాథలకు రూపకల్పన చేసినవిగా విభజించవచ్చు. ఈయన చిత్రకళ దాదాపు సాంప్రదాయక పద్ధతిలో సాగినా పాశ్చాత్య చిత్రకళా రీతులపై, సిద్ధాంతాలపై లోతైన అధ్యయనం చేసి వాటిలోని మార్పులను ధోరణులను వివరిస్తూ అనేక విలువైన వ్యాసాలు రచించి ప్రచురించారు. 1962 మే 6న కన్నుమూశారు.

స్పీకర్‌కు 'గ్రేటర్ బెంగళూరు' బిల్లు

- బడ్జెట్ సమావేశాల్లో శాసనసభ ముందుకు
- బీబీఎంపీని 7 కార్పొరేషన్లుగా విభజించాలని సిఫారసు

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు పాలనా బిల్లును శాసనసభ జాయింట్ కమిటీ చైర్మన్ రిజ్వాన్ అర్షద్ నేతృత్వంలోని బృందం స్పీకర్ యూటీ ఖాదర్‌కు సమర్పించారు. సోమవారం విధానసౌధలో స్పీకర్‌కు సమగ్రబిల్లును అందించారు. అనంతరం రిజ్వాన్ అర్షద్ మీడియాతో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా 20మంది జాయింట్ కమిటీ సభ్యులు ఐదు నెలలుగా వివిధ విధాలుగా అభిప్రాయాలు సేకరించి అందుకు అనుగుణంగా రూపొందించిన బిల్లును స్పీకర్‌కు అందించామన్నారు. మార్చి 3నుంచి జరిగే బడ్జెట్ సమావేశాలలోనే బిల్లును శాసనసభలో ప్రవేశ పెడతామన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై పాలికె ఎన్నిక విభాగాలుగా ఏర్పాటు అనే అంశం తేలనుందన్నారు. బ్రాండ్ బెంగళూరు లక్ష్యంగా న్యాయ నిపుణులు, వివిధ సంఘాలు, ప్రజాభిప్రాయాలను సేకరించామన్నారు. బెంగళూరు దేశంలోనే ఆర్థికంగా ప్రగతి చెందుతున్న నగరమన్నారు. దేశంలో 500 ఫార్చ్యూన్ కంపెనీలలో 400 బెంగళూరులో ఉన్నాయని, ఐటీ ఎక్స్‌పోర్ట్స్ సహా అన్నింటికీ ప్రాధాన్యత కల్గిన నగరమన్నారు. 18 ఏళ్లక్రితం బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) గా ఏర్పడిందన్నారు. నగర విస్తీర్ణం, జనాభా పెరిగిందని ప్రజలు సంతృప్తిగా లేరని ప్రత్యామ్నాయం కోరుతున్నారన్నారు. ప్రజలు కోరుకునే లక్ష్యాలు అమలు కావడం లేదన్నారు. ప్రస్తుతం 1.50 కోట్ల జనాభా ఉందని, మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. పాలనాపరంగా బీబీఎంపీ సంపూర్ణంగా పర్యవేక్షించడం సాధ్యం కావడం లేదని, అనధికారిక నిర్మాణాలే కాకుండా అన్నింటా సమస్యలే అన్నారు. 7 కార్పొరేషన్ల ఏర్పాటుకు సిఫారసు చేశామన్నారు. మరో 30-40ఏళ్ల పాలనాపరంగా సమస్యలు తలెత్తవన్నారు. బెంగళూరులో బీబీఎంపీ, జల మండలి, బీడీఏ, బీఎంఆర్‌సీఎల్‌తోపాటు పలు సంస్థలు సమన్వయం లేనందునే పలు సమస్యలకు కారణమవుతోందన్నారు. బీబీఎంపీ నేరుగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతోందని ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ఉంటే నేరుగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 30లోగా ఎన్నికలు జరగాల్సి ఉందని ఈలోగా రిజర్వేషన్లు, విభజన ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందన్నారు. కనీసం ఆగస్టులోగా ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. కర్ణాటక మునిసిపల్ కౌన్సిల్ యాక్ట్‌కు అనుగుణంగానే సిఫారసులు చేశామన్నారు. అధ్వానమైన బీబీఎంపీ ప్రత్యామ్నాయం కోసమే నగర పరిధిలో 100-120 వార్డులకు ఒక కార్పొరేషన్, జనాభా ప్రకారం చేపట్టాలని సిఫారసు చేశామన్నారు. బెంగళూరు దక్షిణ, ఉత్తర, కేంద్ర, పడమర, తూర్పు లాంటి పేర్లు ఉంటాయన్నారు. ప్రస్తుతం ఉన్న బెంగళూరు మినహా రామనగరతోపాటు ఏ జిల్లా కూడా విలీనం ఉండదన్నారు. అన్ని కార్పొరేషన్లు గ్రేటర్ పరిధిలోకే వస్తాయన్నారు. విభజనలోనూ ఆర్థిక పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సిఫారసు చేశామన్నారు. బీజేపీ సభ్యులు కమిటీలో ఉన్నారని, వారు పార్టీపరంగా విమర్శలను ఏం చేయలేమన్నారు.

కారకూరులో జోరుగా ఎడ్లపందేలు



ఎడ్లపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కారకూరు చెరువులో సోమవారం అభయాంజనేయస్వామి సేవా సమితి, రైతు మిత్రుల బళగ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని జోడెద్దుల పందేలను నిర్వహించారు. బాగేపల్లి, గుడిబండ, చేళూరు తాలూకాలనుంచే సరిహద్దున ఉండే ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలనుంచి 20 జోడెద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. మూడు చోట్ల 200 మీటర్ల దూరం సాగేలా పోటీలు నిర్వహించారు. బ్యారికేడ్‌లను ఏర్పాటు చేసి కన్నడ బావుటాలు ఎగురవేశారు. పోటీలను వీక్షించేందుకు ఎండను సైతం లెక్కించక వందలాదిమంది రైతులు, మహిళా రైతులు యువత పెద్దసంఖ్యలో విచ్చేశారు. ఈలలు, కేకలు వేస్తూ ప్రోత్సహించారు. పోటీలకోసం ఎద్దులను, ఎడ్లబండిని అందంగా ముస్తాబు చేశారు. ఎడ్లకోసం ప్రత్యేకంగా దాణా, నీటి తొట్టెలను సమకూర్చారు. నీడకోసం 5 చోట్ల షామియానాలు వేశారు. పోటీలకు ముందు గ్రామంలోని అభయాంజనేయస్వామి ఉత్సవమూర్తిని గ్రామం నుంచి చెరువుకు తీసుకొచ్చారు. చెరువులో స్వామివారికి ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పూజలు చేశారు. అనంతరం ఎడ్లబండిని తోలడం ద్వారా పోటీలు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ఆటలు క్రమేపీ కనుమరుగవుతున్నాయని ఇటువంటి తరుణంలో ఎడ్లపందేలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కాగా పోటీలలో గెలుపోటములను క్రీడాస్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పోటీల్లో గ్రామస్తులు కే నాగరాజు, హనుమంతరెడ్డి, మద్దిలేటిరెడ్డి, సంతోష్, అనిల్, వెంకటేశ్, నల్లప రెడ్డిపల్లి శ్రీనివాస్, రాయగుర్లంపల్లి శ్రీరామ, చంద్ర, ప్రముఖులు మంజునాథ రెడ్డి, బూరమడుగు లక్ష్మీనరసింహప్ప, గడిదం శివరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌సీబీకి మద్దతుగా అభిమానులు

అభిమానం .. ఉర్రూతలు

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో మహిళా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపీఎల్)లో అభిమానులు కేరింతలు కొట్టారు. సోమవారం సాయంత్రం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) వర్సెస్ యూపీ వారియర్స్ జట్ల మధ్య సాగింది. యువత పెద్దసంఖ్యలో స్టేడియంలో ఆర్‌సీబీ జెండాలను ఊపి ప్రోత్సహించారు. మరోవైపు కన్నడ నటుడు పునీత్ రాజ్‌కుమార్ ఫోటో కల్గిన కన్నడ జెండాను పట్టుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆర్‌సీబీ జట్టు గెలవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈసారి యువతులు కూడా పెద్దసంఖ్యలో మ్యాచ్ వీక్షించేందుకు విచ్చేయడం విశేషం.



కేరింతలు వేస్తూ..



పునీత్‌రాజ్‌కుమార్ ఫొటో జెండాతో ఇలా..

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



మీడియాతో మాట్లాడుతున్న పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న జిల్లా పంచాయతీ, తాలూకా పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. పట్టణానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందే ధైర్యం లేదన్నారు. అందుకే ఎన్నికలు నిర్వహించడానికి వెనుకంజ వేస్తోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. బ్రాండ్ బెంగళూరు వదిలేసి ప్రస్తుతం గ్రేటర్ బెంగళూరు ప్రతిపాదించారని, పలు రకాల పేర్లతో లూటీ చేస్తున్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో రూరల్ అధ్యక్షుడు సీకల్ ఆనందేగౌడ, మధు, నగరసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోసగిస్తే క్షమించేది లేదు : విజిలెన్స్ డీజీ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల్లో మోసాలకు పాల్పడితే క్షమించేది లేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ హరీష్ కుమార్ గుప్తా హెచ్చరించారు. సోములదొడ్డి, సనప సమీపంలోని పెట్రోల్ బంకుల్లో మోసాలపై జిల్లా అధికారుల నుంచి డీజీ కార్యాలయానికి నివేదిక అందింది. దీంతో ఆయన సీరియస్ అయ్యారు. సామాన్యులపై ప్రభావం చూపేలా మోసగించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ సోమవారం ప్రకటన విడుదల చేశారు. సోములదొడ్డి సమీపంలోని శ్రీవిజయలక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంక్‌లో చిప్‌ను వినియోగించి డీజిల్ దోచుకుంటున్న విషయం లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడిన విషయం తెలిసిందే. ఆత్మకూరు మండలంలోని సనప గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంకులో శనివారం దాడులు నిర్వహించారు. అధికారులు గుర్తించలేని స్థాయిలో అత్యాధునిక చిప్‌ను అమర్చి, పెట్రోల్‌ను దోచుకుంటున్నట్లు విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను కొనసాగించాలన్నారు.

చీనీ టన్ను రూ.22వేలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,050 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.11,500తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 169 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

చట్టాలపై నిరంతర అధ్యయనం తప్పనిసరి

- సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్



మూట్‌కోర్టు పోటీలలో న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): లా విద్యార్థులు చట్టాలపై నిరంతర అధ్యయనం చేయాలని లిటిగేషన్‌ల ద్వారానే పిటీషన్లు దాఖలు అవుతాయని, వాటిని చట్టంలోని సెక్షన్‌ల ప్రకారం ఏ విధంగా పరిష్కారం చూపాలనే వాదనలు వినిపించేందుకు సిద్ధం కావాలని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. పీఈఎస్ యూనివర్సిటీలో మూట్‌కోర్టు పోటీలు మూడు రోజులపాటు జరిగాయి. న్యాయమూర్తి అరవింద్‌కుమార్ మాట్లాడుతూ ఒక వ్యక్తి వృత్తి జీవనంలో ముందుకు సాగేందుకు ఎంపిక చేసుకున్న రంగంలోనే ఉత్తమమనిషిగా రాణించాలన్నారు. న్యాయ విద్యార్థులు వాదనలు, పిటీషన్‌ల గురించి నిరంతరం అధ్యయనం, సీనియర్‌ల నైపుణ్యత గురించి తెలుసుకోవాలన్నారు. ముగింపు సమావేశంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్ఆర్ కృష్ణకుమార్, జస్టిస్ సీఎం పూనచ్చ, జస్టిస్ విజయ్‌కుమార్ పాటిల్, ఉపలోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర, హైకోర్టు అడిషినల్ సొలిసిటర్ జనరల్ అరవిందకామత్‌లు పాల్గొన్నారు. పీఈఎస్ యూనివర్సిటీ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి, వీసీ డాక్టర్ జే సూర్యప్రసాద్‌ల పర్యవేక్షణలో ప్రదర్శనలు కొనసాగాయి. సీఎంఆర్ యూనివర్సిటీ విద్యార్థులు విజేతలుగా నిలవగా బెంగళూరు ఎన్ఎం ఐఎంఎస్ రన్నర్స్‌గా నిలిచారు. సీఓఓ అజయ్ కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. మూట్ కోర్టు పోటీలు ఉత్సాహంగా సాగాయి.

ఉన్నత వ్యక్తిత్వంతోనే మార్పు



పుస్తకావిష్కరణలో మధుసూదనసాయి తదితరులు

చిక్కబళ్లాపుర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి ప్రవర్తన, జీవన విధానం, అంకితభావం వంటివి అతడిని చారిత్రక వ్యక్తిగా మారుస్తాయని, ఉన్నత వ్యక్తిత్వంతోనే మార్పు సాధ్యమని మధుసూదనసాయి అభిప్రాయపడ్డారు. ముద్దేనహళ్ళిలోని సత్యసాయి ప్రేమామృతం సభాభవన్‌లో ప్రశాంతి సద్భావన ట్రస్టు సద్భావన దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ముద్దేనహళ్ళి ప్రాంతంలో విద్యను వ్యాప్తి చేసిన ఘనత నారాయణరావుకే దక్కుతుందన్నారు. తన జీవితకాలంలో పెద్దసంఖ్యలో అభిమానులను, శిష్యులను సంపాదించారన్నారు. నిబద్ధతతకు ఆదర్శానికి ప్రతీకంగా జీవించారు. నారాయణార్పణం స్మృతి గ్రంథాన్ని ఆవిష్కరించారు. దక్షిణకన్నడ జిల్లా పుత్తూరులోని ప్రశాంతి సద్భావనా ట్రస్టుకు చెందిన మధుసూధననాయక్ నేతృత్వంలోని సంపాదకవర్గం పుస్తకం కోసం కృషి చేసిందన్నారు. రాజీవ్, ఎంఎస్ సత్యనారాయణ, గోవిందభట్, సదాశివరావు వంటి రచయితలు, దాతలు, భక్తులు పుస్తకాన్ని రూపొందించేందుకు సహకరించారన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మానవ అభ్యుదయ విశ్వవిద్యాలయం కులపతి బీఎన్ నరసింహమూర్తి, డాక్టర్ సంజయ్, నాగయ్య, మఠంపాటి, ఎంపీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీలో 10 శాతం రాయితీ

బెంగళూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వారికి 10శాతం రాయితీ ప్రకటించారు. బెంగళూరు నుంచి ప్రతిరోజూ సంచరించే 25 సర్వీసులలో 10శాతం రాయితీ వర్తించనుందని టీఎస్ఆర్టీసీ బెంగళూరు ఏటీఎం ప్రసాద్‌గౌడ సోమవారం మీడియాకు తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఖమ్మం, నిజామాబాద్‌తోపాటు టీఎస్ఆర్టీసీ అన్ని సేవలకు రాయితీ కల్పించామన్నారు. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో ముందస్తు రిజర్వేషన్, రానుపోను ప్రయాణం చేసేవారికి మాత్రమే నిబంధన వర్తించేదని ప్రస్తుతం ఎటువంటి నిబంధన లేకుండా 10శాతం రాయితీ కల్పిస్తున్నామన్నారు.

ఈ-ఖాతా అభియాన ప్రారంభం



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

బాగేపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బాగేపల్లి పట్టణం పురసభ పరిధిలో అనధీకృత ఆస్తులకు ఖాతా ఇచ్చేందుకు సంబంధించి ఉద్దేశించిన చట్టం, నియమాలకు సంబంధించి సవరణలు చేపట్టామని ఇ-ఖాతా అభియానను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. అనధీకృత ఆస్తులకు (బి-ఖాతా) యజమానులు ఆస్తి పన్ను చెల్లించడం ద్వారా ఇ-ఖాతా పొందాలన్నారు. పట్టణంలోని పురసభ సభాంగణంలో సోమవారం ఇ-ఖాతా అభియానకు శ్రీకారం చుట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలోని స్థలాలు, వసతి భవనాలు, వాణిజ్య కట్టడాలు, ఇంటి ఆస్తులు, ఖాళీ స్థలం ఉన్నవారు రికార్డులతో పురసభ కార్యాలయంలో అర్జీ సమర్పించడం ద్వారా ఇ-ఖాతా పొందవచ్చునన్నారు. మూడు నెలల పాటు ఖాతా అభియాన ఉంటుందని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఖాతాలకోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. పురసభ ముఖ్యాధికారి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆస్తుల యజమానులు తమ పత్రాలతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు పన్ను చెల్లించి, రుణభార ప్రమాణపత్రం, యజమాని ఫోటో, ఆధార్ కార్డుతో ఇ-ఖాతా పొందవచ్చునన్నారు. సమావేశంలో పురసభ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు సుజాత నరసింహనాయుడు, పురసభ సభ్యులు నంజుండప్ప, జబీవుల్లా, సరోజ, రేష్మాబాబు, సునితా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హంచాళగేట్ సమీపానగల ఫీల్డ్ మార్షల్ కేఎం మారియప్ప గ్రూప్ విద్యాసంస్థల 38వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గ్రూప్ ఆధ్వర్యంలో 13 కళాశాలలు కొనసాగుతున్నాయని విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 1986లో ప్రారంభమైన వేళ కోలారు, బంగారపేటల నడుమ ఎలాంటి కళాశాల లేదన్నారు. ప్రస్తుతం తమ విద్యాసంస్థ తాలూకా, జిల్లా పరిమితం కాకుండా వివిధ రాష్ట్రాల విద్యార్థులు చదువుతున్నారన్నారు. రానున్న రోజుల్లో ఇంజనీరింగ్, మెడికల్ కళాశాల ప్రారంభించే లక్ష్యం ఉందన్నారు. 2025-26 సంవత్సరానికి ఎంఎస్‌సి ఫార్మసీ, పీయూ, బిఇడి, డిగ్రీ కాలేజీని ప్రారంభించదలిచామన్నారు. ఇటీవల సేనాల్ట్ మెంబర్స్‌తో నర్సింగ్ కళాశాలలో ఏర్పడుతున్న సమస్యలపై చర్చించామన్నారు. కొత్త నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు 350 పడకలు అవసరమని కొత్త నిబంధనలు తెచ్చారన్నారు. దీంతో చిన్నాచితకా నర్సింగ్ కాలేజీల నిర్వహణ సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో మేల్విన్ మైఖేల్, సంస్థ కార్యదర్శి అమరనాథ్, జడ్పీ మాజీ సభ్యుడు అరుణ్ ప్రసాద్, సంస్థ పాలనాధికారి లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో 1122 మంది వచనగాన వైభవం



సామూహిక గాన కచేరీలో పాల్గొన్న గాయకులు

బెంగళూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో వచనగాన వైభవం మరో రికార్డును సృష్టించింది. రవీంద్ర కళాక్షేత్రలోని సంస రంగమందిరలో ఏకకాలంలో 1122మంది గాయకులు పది వచనాలను పాడడం ద్వారా గ్లోబల్ వరల్డ్ రికార్డులో చేరినట్టయ్యింది. బండ్లహళ్ళి విజయ్‌కుమార్ నేతృత్వంలో సుమారు 6 నెలలకాలంగా వివిధ బృందాలు, కళాశాలలు, మహిళాసంఘాలకు శిక్షణలు ఇచ్చి వచనాలను పాడించారు. బసవ వేదిక, రమశ్రీ గ్రూప్ సంస్థలు, అక్కమహాదేవి సమితి, సుమంగళి సేవాశ్రమ, శేషాద్రిపురం కాలేజ్, బసవ అధ్యయనకేంద్రం, రంగసంస్థాన లాంటి సంస్థలు భాగస్వామ్యులయ్యాయి. తరళబాళు మఠం డాక్టర్ పండితారాధ్య శివాచార్యస్వామిజీ ముఖ్యులుగా పాల్గొన్నారు. యోగాగురు సంతోష్ గురూజీతోపాటు మాజీ ఐపీఎస్ శంకర్‌బిదరి, శేషాద్రిపురం విద్యాసంస్థ ముఖ్యులు ఉడే పి కృష్ణ, మాజీ మంత్రి లీలావతి ఆర్ ప్రసాద్, ఆడిటర్ షడాక్షరి, సోమశేఖర్‌తోపాటు పలువురు భాగస్వామ్యులయ్యారు. 1122మంది ఏకకాలంలో వచనాలు ఆలపించిన చరిత్ర ఇప్పటివరకు లేదని ప్రకటించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ




భూమిపూజలో ఎమ్మెల్యే మంజులా లింబావళి

మహదేవపుర, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మహదేవపుర నియోజకవర్గంలోని మారతహళ్ళి, దొడ్డనెక్కుంది, ఎఇసిఎస్ లే అవుట్ వార్డులలో ఎల్ఇడి విద్యుత్ వీధి దీపాల అమరిక, రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మంజులా లింబావళి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతతో పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇదే సందర్భంగా అశ్వతనగరలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హోబళి టౌన్ అధ్యక్షుడు ఎన్ఆర్ శ్రీధర్‌రెడ్డి, దొడ్డనెక్కుంది వార్డు పనుల ఇన్‌చార్జ్ మిథున్‌రెడ్డి, చందన్‌రెడ్డి, శక్తికేంద్రం అధ్యక్షుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌లో పడి యువకుడి మృతి

గుత్తిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండంలోని జ క్కలచెరువు గ్రామ సమీపాన సోమవారం ప్రమాదవశాత్తు క్రషర్‌లో పడి యువకుడు సురేంద్ర(34) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన సురేంద్ర క్రషర్ మిషన్‌లో పనికెళ్తుండేవాడు. సోమవారం మధ్యాహ్నం పనిచేస్తుండగా మిషన్‌లో రాళ్లు అడ్డు పడడంతో వాటిని తీయడానికి వెళ్లాడు. అక్కడ మిషన్‌లోకి వచ్చే రాళ్లు ప్రమాదవశాత్తు సురేంద్ర మీద పడ్డాయి. తోటి కూలీలు రాళ్లు తొలగించేలోపు అతడు మరణించాడు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సురేంద్రకు భార్య, కుమారుడు ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1609.87	1,587.55
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,104	507
నీటి నిల్వ (టీఎంసీలు)	37.31	9.11

బైకును ఢీకొన్న బస్సు... యువకుడి మృతి

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కేఎస్‌ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో యువకుడు మృతి చెందాడు. సోమవారం బళ్లారి రూరల్ పరిధిలోని మోకా సమీపంలో గల ఎర్రగుడి, బెణకల్ గ్రామాల మధ్య ప్రమాదం జరిగింది. మేఘనాథ్ అనే యువకుడు ఎర్రగుడి నుండి బెణకల్లు గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా బెణకల్లు నుంచి ఎదురుగా వస్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మోకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హంపిలో గాయని మంగ్లి



కంప్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి) : తెలుగు, కన్నడ, హిందీ పలు భాషల్లో పేరుగాంచిన గాయని మంగ్లి సోమవారం హంపిని దర్శించుకుంది. ఉదయం విరుపాక్షేశ్వరాలయం, ఏకశిలా రథం, కమల్ మహల్, అంజనాద్రి జన్మస్థలం, వివిధ ప్రత్యేకమైన ఆలయాలను, స్థలాలను హంపిలో దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంగ్లి ఏటా హంని విరుపాక్షేశ్వరుడిని దర్శించుని పూజలు నిర్వహిస్తానన్నారు. హంపి ఉత్సవాల్లో పిలుపు వస్తే పాల్గొంటానన్నారు. గతంలో హంపి ఉత్సవాల్లో తనకు ఎంతో గుర్తింపు వచ్చిందన్నారు.

నేటి నుంచి ధ్వని బెళుకు ప్రారంభం

హంపి ఉత్సవాల సందర్భంగా గజశాల వద్ద ధ్వని బెళుకు వేడుకను ఏర్పాటు చేశారు. హంపి ఉత్సవాలు మూడురోజుల ముందుగానే ధ్వని బెళుకు ప్రారంభమవుతున్నట్లు జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ తెలిపారు. సుమారు 110 మంది కళాకారుల బృందం పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అవినీతి ఆరోపణలపై అధికారి అరెస్టు

రాయచూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన అవినీతికి సంబంధించి నిందితుడిగా అధికారులు తెలిపిన ఎస్‌డీసీ యల్లప్ప సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన వెంటనే తప్పించుకున్న యల్లప్ప కలబుర్గిలోని జేవర్గిలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని జిల్లాకు తరలించారు. తహసీల్దార్ కార్యాలయంలో 1.87 కోట్ల అవినీతికి యల్లను ప్రధాన నిందితుడిగా అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ సొమ్మును తన భార్య, కూతురు, కొడుకు పేరు మీద కెనరా బ్యాంక్ ఖాతాల్లోకి దారిమళ్ళించిన విషయం పై ఆయన పై ఇప్పటికే కేసు నమోదైంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వీరేశ్‌ను సహితం పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానానికి అప్పగించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో దేశభక్తి

సిరుగుప్ప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్ శాంతి, దేశభక్తి చాటుతుందని సదాశివ రెడ్డి పాఠశాల ముఖ్య ఉపాధ్యాయులు కుమారగౌడ తెలిపారు. సిరుగుప్ప తాలుకా పరిధిలోని దేశనూరు గ్రామంలో తాలుకా పరిపాలన, విద్యాశాఖ, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో స్కౌట్ అండ్ గైడ్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. నాగరాజు, కోటిరెడ్డి, అబ్దుల్ నబీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇబ్బందులున్నా గ్యారెంటీలు కొనసాగిస్తాం

● హామీల అమలుకు కట్టుబడిన ప్రభుత్వం : శాసనసభా వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులున్నా గ్యారెంటీలు కొనసాగిస్తామని, బడ్జెట్‌లో హామీల గురించి అడిగే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇస్తుందని శాసనసభా వ్యవహారాల మంత్రి హెచ్.కే. టపాటిల్ అన్నారు. బళ్లారిలో సోమవారం ఆయన విలేకరులతో మట్లాడుతూ గృహజ్యోతి, గృహలక్ష్మి కోసం డబ్బును విడుదల చేస్తామన్నారు. గ్యారెంటీల అములులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదన్నారు. గృహజ్యోతి భారం ఏ వినియోగదారుడిపైనా ఉండదన్నారు. హామీల ఆర్థిక భారంగా మారుతున్న మాట నిజమే రూ.50వేల కోట్లు అంటే చిన్న మొత్తం కాదు. కానీ గ్యారెంటీల అమలు కొనసాగిస్తామన్నారు. తమ శాసనసభ్యులు ఎవరూ హామీని తగ్గించడం గురించి మాట్లాడలేదు. బడ్జెట్‌లో వీటన్నింటికీ సమాధానం దొరకుతుందన్నారు.

సీఎం, పార్టీ అధ్యక్షుడి మార్పు లేదు..

కేపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి మార్పు గురించిన చర్చలు కేవలం కల్పితాలేనని, మార్పు గురించి చర్చ జరగలేదని ఖర్గే స్వయంగా తనతో చెప్పారన్నారు. ఈ విషయం గురించి ఎవరూ మాట్లాడకూడదన్నారు.

మిర్చి మార్కెట్‌ను త్వరగా పూర్తి చేయండి

● జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు గణపాల రెడ్డి

బళ్లారిలో మంజూరైన 21ఎకరాల మిర్చి మార్కెట్‌ను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు గణపాలరెడ్డి మంత్రి హెచ్‌కే పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా గణపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మిరప పంట అతి ముఖ్యమైనదని, మిర్చి ధరలు పడిపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ రైతు ఖర్చుపెట్టే సుమారు రూ.1.75 లక్షల నుంచి 2లక్షల వరకు ఉండేది. ఇప్పటి రోజుల్లో సుమారు రూ.3లక్షల నుంచి 3.5లక్షలకు చేరుకుందన్నారు. మార్కెట్ ధర 8,500 నుంచి రూ.9,000 వరకు పడిపోవడంతో రైతులకు భారీ నష్టాలు తప్పడం లేదన్నారు. మిరప ధర పడిపోవడంతో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారు రాసిన లేఖలను మంత్రికి అందించారు. బళ్లారిలో మిర్చి మార్కెట్ నిర్మాణంతోనే రైతుల కష్టాలు తీరుతాయన్నారు.



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న గణపాలరెడ్డి

జోగి మంజమ్మకు మేఘాలయ గవర్నర్ సత్కారం



జోగి మంజమ్మను సత్కరిస్తున్న గవర్నర్ విజయశంకర్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మేఘాలయ రాష్ట్ర గవర్నర్ హెచ్ విజయశంకర్ 2021 పద్మశ్రీ అవార్డు గ్రహీత మాతా మంజమ్మ జోగి ఇంటిని సోమవారం సందర్శించి ఆమెను జ్ఞాపికతో సత్కరించి అభినందించారు. అంతకు ముందు మంజమ్మ జోగి బృందం సభ్యులు గవర్నర్‌ను జోగి పాట, నృత్యంతో తమ ఇంటికి స్వాగతించారు. తమ బృందం జోగి నృత్యం, పాటలను శ్రద్ధగా విని ప్రశంసించారు. తర్వాత మంజమ్మ పలు సమస్యలపై గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. గవర్నర్‌కు సమర్పించిన పిటిషన్‌లో తాను పద్మశ్రీ అవార్డు అందుకున్నప్పుడు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ పురోగతి కోసం ప్రభుత్వం నుంచి డిమాండ్ చేసిన మూడు ఎకరాల భూమి ఇంకా అందలేదన్నారు. ట్రాన్స్‌జెండర్ కోసం ఓ పదవీ విరమణ గృహాన్ని, కళా శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలనుకుంటాన్నానన్నారు. లింగమార్పిడి జీవితంలోని క్లిష్ట పరిస్థితులను వారు స్వయంగా అనుభవించడమే కాకుండా, వృద్ధ లింగమార్పిడి వ్యక్తులు వారి కుటుంబాలు మాత్రమే కాకుండా మొత్తం సమాజం కూడా నిర్లక్ష్యంగా చూస్తుందన్నారు. వారికి సౌకర్యవంతమైన జీవితాన్ని గడపడానికి వృద్ధాశ్రమం అవసరమన్నారు. లింగమార్పిడి వారికి యోగాకు ఇది ఉపయోగపడుతుందన్నారు. అందువల్ల ఆర్ట్స్ అండర్ స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ట్రాన్స్‌జెండర్ల స్వావలంబనను ప్రోత్సహించాలనేది తన గొప్ప కోరిక అన్నారు. ఈవిషయంలో మీ సహాయం మన తోలి పౌరుల జీవితాలను మెరగుపరచడమే కాకుండా, లింగమార్పిడి వ్యక్తుల జీవితాలకు శ్రేయస్సును కూడా కలిగిస్తుందని ఆశిస్తున్నానన్నారు. గవర్నర్ వెంట తహసీల్దార్ శృతి ఎం.మల్లనగౌడ, ఖాజామైనుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, బిజేపీ సంజీవ్‌రెడ్డి, కృష్ణనాయక్, బెనకల్ ప్రకాశ్, రాఘవేంద్రశెట్టి, వీరేశ్వరస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి



మేయర్ నందీశ్‌కు వినతి పత్రం ఇస్తున్న పౌర పోరాట కమిటీ సభ్యులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్(సెయింట్ ఫిలోమినా వైపు) ముందు సీసీ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, తక్షణమే అక్కడ స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సోమవారం బళ్లారి పౌర పోరాట కమిటీ(బీఎన్‌హెచ్‌ఎస్) నగరమేయర్‌కు ముల్లంగి నందీశకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా బళ్లారి పౌర పోరాట కమిటీ కన్వీనర్ సోమశేఖర్‌గౌడ, డా.ప్రమోద్ మాట్లాడుతూ.. సెయింట్ మేరీస్ స్కూల్ ముందున్న సీసీ రోడ్డులో ట్రాఫిక్ భారీగా పెరిగిందని, ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు తప్పనిసరి అన్నారు. సుధా క్రాస్ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభమైన నాటి నుంచి, ట్రాఫిక్ పెరిగిందన్నారు. అలాగే నగరంలో ఉదయం 6గంటల నుండి రాత్రి 10గంటల వరకు భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించాలన్నారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా శాంత, సురేశ్, ఉమేశ్, గోవిందరాజులు, శంకర్, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

విద్యతోనే జీవితంలో విజయం

● పురసభ అధ్యక్షుడు బట్టా ప్రసాద్



మాట్లాడుతున్న పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్

కంప్లి, ఫిబ్రవరి 24(ఆంధ్ర జ్యోతి): నిత్యజీవితంలో మనిషికి విద్య కన్నా గొప్పది మరేదీ లేదని పురసభ అధ్యక్షులు బట్టా ప్రసాద్ తెలిపారు. కంప్లి పట్టణంలో సోమవారం వినూత్న విద్య కళాశాల, మదర్ థెరిస్సా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంప్లి పట్టణంలో వినూత్న విద్య సంస్థ, మదర్ థెరిస్సా సంస్థలు మహిళలకు కళాశాల ఏర్పాటు చేయడంతో గ్రామాలలో వున్న విద్యార్థులు కూడా చదువుకునేందుకు ముందుకొచ్చారు. ఈ కళాశాలలో ఉన్నత విద్య అందించడంతో ప్రతి విద్యార్థి విద్యాభ్యాసం కోసం ముందుకొస్తున్నారన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థి ఘటక శాఖను కూడా ప్రారంభించారు. మద్దానప్ప, రాజమ్మ, ఉలిగప్ప, ప్రకాష్, మూకయ్య స్వామి, కుమారస్వామి, మహాబలేశ్వరప్ప, బాలప్ప, రాజ్యలక్ష్మీ, భాగ్యమ్మ, మంజుళ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొప్పళ బంద్ విజయవంతం



నిరసనలో మాట్లాడుతున్న గవి సిద్దేశ్వర స్వామి

గంగావతి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కర్మాగారాల విస్తరణను వ్యతిరేకిస్తూ సోమవారం చేపట్టిన కొప్పళ జిల్లా బంద్ విజయవంతం అయ్యింది. ఉదయం 6గంటల నుంచే అన్ని సంస్థలు, కార్యాలయాలు మూసివేవారు. తమకు ఉక్కు కర్మాగారం వద్దు అంటూ సంఘసంస్థలు, రాజకీయ నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి నినాదాలు చేశారు. గవి సిద్దేశ్వర మఠం నుంచి అశోక్ సర్కిల్ క్రికెట్ క్రీడాంగంలో ఏర్పాటు చేసిన వేదిక వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా గవిసిద్దేశ్వర స్వామి మాట్లాడుతూ కర్మాగారం నిర్మాణం వల్ల భూమి, నీరు ప్రజల ఆరోగ్యానికి జరిగే నష్టాలను వివరించారు. జిల్లాఇన్‌చార్జిమంత్రి శివరాజ తంగడగి ఓటమి ఎరుగని నాయకుడని, ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాల్, ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు బసవరాజ రాయరెడ్డి ఈ ముగ్గురు ప్రభుత్వం నుంచి కర్మాగార బంద్ ఆదేశ పత్రం తీసుకురావాలన్నారు. కొప్పళ జిల్లా ఆరోగ్యంగా ఉండాలని, ఎలాంటి అనారోగ్యాలు చేరరాదన్నారు. ఇలాంటి పెద్దపెద్ద ఉక్కు కర్మాగారాల వల్ల భూములు కోల్పోయి పంటలు నాశనమవుతాయన్నారు.

ఎస్‌ఎస్‌ఎల్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు ● రైతులందరికీ కృషి హోండ: పరిపాలనాధికారి మల్లికార్జున

బళ్లారి గాంధీనగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలో ఎస్‌ఎస్‌ఎల్‌సీలో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని బళ్లారి తాలూకా పంచాయతీ పాలనాధికారి మల్లికార్జున సూచించారు. సోమవారం తాలూకా పంచాయతీ సభాంగణంలో జరిగిన త్రైమాసిక ప్రగతి పరిశీలనా కార్యక్రమంలో 19ప్రభుత్వ శాఖల పనితీరును ఆయన పరిశీలించారు. తాలూకా వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి హోండ (వ్యవసాయ కుంట) ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించనుందని, ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, ఇతర వర్గాల వారికి 80 సబ్సీడిని కల్పిస్తోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఉద్యానవన పథకాలు సక్రమంగా అమలు జరగాలని, వేసవిలో విస్తరించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శిశు అభివృద్ధి యోజన క్రింద నిర్వహింపబడుతున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం చేయరాదని, సొంత కట్టడాల కోసం ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో పీడీఓల సహాయం తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, అందులో ముఖ్యంగా ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. పశువుల్లో తరచూ వచ్చే నీలి నాలుక వ్యాధి నివారణకు పశువైద్య అధికారులు గ్రామీణ ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అవసరమైన టీకాలు వేయాలని సూచించారు. హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ కాలువల నిర్వహణల పనులు చేపట్టి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలని నెం 6 విభాగం అధికారులకు సూచించారు. మార్చి నెలలో ప్రారంభం అయ్యే 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పాఠ్యాంశాలు, సామాజిక విజ్ఞానం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లాధికారి, జడ్పీ సీఈఓ సూచనల మేరకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందించిదని, విద్యాశాఖతో సంయుక్తంగా తాలూకా స్థాయి ప్రభుత్వ అధికారులు ప్రణాళికలో చూపిన విధంగా ఆయా పాఠశాలలకు వెళ్ళి విద్యార్థులతో పాఠ్యాంశాల గురించి చర్చించాలన్నారు. కేడీపీ సమావేశానికి గైర్హాజరైన అధికారులను నోటీసులు జారీ చేయాలని సభా ముఖంగా సూచించారు. పంచాయతీ ఈఓ బసప్ప, వివిధ గ్రామ పంచాయతీల పీడీఓలు, తాలూకా స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లికార్జున

డ్రైవర్లకు అవగాహన

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా పోలీస్ స్టేషన్ ఆవరణంలో సీఐ రుద్రప్ప ఆటో గూడ్స్ వాహన యజమానులకు, డ్రైవర్లకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రైవర్లకు వాహనాల్లో అత్యధిక లోడుతో ప్రయాణికులను తరలించకూడదన్నారు. వాహనాల్లో కూలీ కార్మికులను రవాణా చేసేందుకు గూడ్స్ వాహనదారులకు ప్యాసింజర్ వాహనాల్లో రవాణా చేయాలని ప్రయాణికులను వారి భద్రత కోసం ప్యాసింజర్ వాహనాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కాళింగ పోలీసు సిబ్బంది గూడ్స్ వాహన డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ రుద్రప్ప

హోసూరు జోన్



నిరసనలో వివిధ పార్టీల నాయకులు

బలవంతపు హిందీపై నిరసన

హోసూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం హిందీ భాషను బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తుండడంపై ద్రవిడ కళగం పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వనవేందన్ అధ్యక్షత వహించారు. డీఎంకే జిల్లా కౌన్సిల్ అధ్యక్షుడు యువరాజ్, ద్రావిడ కళగ జనరల్ కమిటీ సభ్యుడు సెల్వం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ నాయకుడు సాదికార్, చిరుతైగళ్ పార్టీ జిల్లా కార్యదర్శి రామచంద్రన్‌లు నిరసనలో పాల్గొన్నారు. తాము హిందీకి వ్యతిరేకం కాదని అయితే బలవంతంగా రుద్దితే సహించేది లేదన్నారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

నాలుగు తులాల నగల రికవరీ

హూసూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఓ చోరీ కేసులో నాలుగు తులాల బంగారాన్ని పోలీసులు రికవరీ చేశారు. వివరాలిలా. తిరుపత్తూరు జిల్లా నాట్రంపల్లి సమీపంలోని అందికొట్టనూరు గ్రామానికి చెందిన సంపత్ భార్య దైవానె (55) నగలతో కూడిన పర్సును హోసూరులో పోగొట్టుకుంది. పర్సులో సుమారు 4 తులాలబంగారం ఉందని దుండగులు ఎవరో కొట్టేశారంటూ హోసూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై జ్యోతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హోసూరు బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమె పెద్దలంపల్లి గ్రామానికి చెందిన మునిరాజు భార్య పళనియమ్మ (40)గా గుర్తించారు. ఆమెనుంచి నగలు రికవరీ చేశారు. నిందితురాలిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.



నిందితురాలు పళనియమ్మ

పరిహారం జాప్యంపై రైతుల ఆగ్రహం

కంప్లి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నష్టపరిహారం చెల్లింపులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డును మూసివేసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగటలూరు ఎత్తిపోతల పథకం కింద అయ్యన్న హళ్లి వద్ద పొలాల్లో కాలువ తీశారు. ఆ రైతులకు నష్టపరిహారం కల్పిస్తామని ఇంతవరకు కల్పించలేదని రైతులు నియాజ్, చలవాది లింగప్ప, తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు నష్టపరిహారం కల్పించే వరకు అయ్యన్నహళ్లి వద్ద రాకపోకలు బంద్ చేపట్టామని తెలిపారు. ఎత్తిపోతల పథకం కింద నీరావరి చేసే సమయంలో నష్టపరిహారం కల్పిస్తామని తమ పొలాలు మొత్తం నాశనం చేశారని ఇదిగో అదిగో నష్టపరిహారం కల్పిస్తామని రోజులు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వం నష్టపరిహారం కల్పించలేదన్నారు. రైతులకు నష్టపరిహారం కల్పించే వరకు అయ్యన్న హళ్లి వద్ద రాకపోకలు బంద్ చేస్తామని హెచ్చరించారు.



అయ్యన్నహళ్లి రోడ్డుకు గుంతలు తవ్వి ముళ్లకంపలు వేసిన రైతులు

పులి సంచారంపై పుకార్లు..!

● సోషల్ మీడియాలో జోరుగా వీడియోల వైరల్ ● భయాందోళనల్లో గ్రామస్థులు

రాయచూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని వడ్లూరు గ్రామ పరిసరాల్లో పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు గ్రామంలో కలకలం రేపాయి. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు సోషల్ మీడియాల్లో ఈ వార్త వైరల్ కావడంతో ఒక్కసారిగా గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. పులి సంచరిస్తున్నట్లు ఉన్న ఫోటోలు పులి జాడలతో ఉన్న వీడియోతో పాటు గ్రామ దేవాలయం వద్ద వ్యక్తి ఒకరు మైక్‌లో పులి సంచరిస్తుందంటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేస్తున్న హెచ్చరిక దాంతో పాటే గ్రామంలోకి పోలీసులు వచ్చారని విషయాలు వారికి వివరించాలంటు గ్రామస్థులను మైక్ ద్వార కోరుతున్న వీడియో సహితం వైరల్‌గా మారడంతో గ్రామంలో ఎక్కడ చూసినా ఉత్కంఠ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న అటవి శాఖ అధికారులు ఆదివారం రాత్రి గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో అధికారుల పరిశీలనలో పులి సంచరిస్తున్నట్లుగాని లేక పులి జాడలుగాని ఎక్కడ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో దురుద్దేశపూర్వకంగా కొంతమంది దుండగులు గాలివార్తలు సృష్టించి ఉంటారన్న అనుమానం అధికారుల్లో ఉంది. ఏదిఏమైన గ్రామంలో మాత్రం స్థానికులను ఆందోళనలకు గురైయ్యేలా చేశాయి.



సోషల్ మీడియాలో వైరలైన పులి

రాఘవేంద్ర స్వామి సన్నిధిలో శివరాజ్‌కుమార్

రాయచూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కన్నడ చలన చిత్ర నటుడు హ్యాట్రిక్ హిరోగా అభిమానుల నిరాజనం అందుకుంటున్న శివరాజ్‌కుమార్ ప్రముఖ పుణ్యక్షేత్రం మంత్రాలయాన్ని దర్శించుకున్నారు. శివరాజ్‌కుమార్ భార్య గీతా, కుమార్తె నివేదితతో పాటు మేనల్లుడుతో కలిసి శ్రీ రాఘవేంద్ర మఠాన్ని సందర్శించి రాయల ఆశీర్వాదం పొందారు. అనంతరం మఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ శ్రీపాదుల వారిని కలిసి ఆయన నుంచి ఆశీస్సులు అందుకున్నారు. కాగా నటుడు శివరాజ్‌కుమార్ మంత్రాలయం వస్తున్నాడని వార్త అందుకున్న ఆయన అభిమానులు రాయచూరు నగరం నుంచి పెద్దసంఖ్యలో మంత్రాలయానికి తరలివెళ్లారు.



మఠాధిపతి ఆశీస్సులు పొందుతున్న శివరాజ్‌కుమార్ దంపతులు

విద్యార్థులు ప్రతిభా పోటీల్లో పాల్గొనాలి: బీఈఓ

సిరుగుప్ప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతిభ పోటీల్లో పాల్గొనాలని జిల్లా విద్యాశాఖాధికారి శివశంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం సిరుగుప్ప పట్టణం ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కలిక పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉత్తమ ఫలితాలు పొందాలని ఆయన తెలిపారు. పరీక్షలు సమీపిస్తుండటంతో సమయాన్ని వృథా చేయకుండా చదవాలన్నారు. విద్యాధికారి గుర్రప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పొందాలని ఆయన విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ముఖ్య ఉపాధ్యాయురాలు పర్వీన్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు